మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

'ద్రావిడ'లో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- గుడిపల్లి: గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి బుధవారం విద్యార్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఆమెతోపాటు గవర్నమెంట్ విప్, ఎమ్మెల్సీ కుప్పం డెవలప్మెంట్ అథారిటీ పొలిటికల్ ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. మొదట జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య దొరస్వామి గత 15 నెలల్లో విశ్వవిద్యాలయం సాధించిన అనేక విషయాలను ప్రస్తావించారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే విషయంలో రాష్ట్రం మంత్రి లోకేష్ నాయకత్వంలో అనేక విజయాలు సాధిస్తున్నామని అన్నారు. ద్రావిడ విజయాలయాన్ని కూడా అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. నారా భువనేశ్వరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో అనేక రకాల ఒత్తిళ్లు ఉండడం చాలా సహజమని, వాటిని మనం ఏ దృష్టి కోణంలో చూస్తున్నామో, ఎలా ఎదుర్కొంటున్నాం అన్న చాలా ముఖ్యమన్నారు. సమాజం పట్ల సానుకూల దృక్పథం ఉంటే చాలా వరకు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులందూ మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని నిజాయితీతో, క్రమశిక్షణతో శ్రమిస్తే తప్పకుండా మంచి ఫలితాలను సాధించగలరని అన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈకార్యక్రమంలో కుప్పం డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వికాస్ మర్మత్, ద్రావిడ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య కే.శ్యామల, వివిధ శాఖల అధ్యక్షులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

రామకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా కూటమి శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. బుధవారం బెంగళూరు ఎయిర్ పోర్ట్ నుంచి కోలార్, వి కోట మీదుగా మండలంలోని చల్దిగానిపల్లి గ్రామానికి ఆమె చేరుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఉడా చైర్మన్ సురేష్ బాబు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. కార్యక్రమంలో కూటమి నేతలు మునస్వామి, పట్రా నారాయణ, వెంకటరమణ, ఆనంద్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి,చిన్ని కృష్ణ, గుర్రప్ప, కామరాజ్ నాయక్, కృష్ణానాయక్, నరసింహులు, రఘు, విశ్వనాథ్, రఫీ, గంట్ల గౌడు పాల్గొన్నారు.

నేడు ద్రౌపదిముర్ము రాక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటనలో భాగంగా తిరుపతి, తిరుమలకు రానున్నారు. రాష్ట్రపతి పర్యటించే ప్రాంతం మొత్తాన్ని ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం ట్రయల్ కాన్వాయ్ నిర్వహించారు. తిరుమల, తిరుపతిలో పర్యటించే ప్రాంతాల్లో షాపులు, ఇతర వ్యాపార సంస్థలు పదిరోజులుగా మూసివుంచారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి తిరుమలలో పర్యటించి భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయానికి గురువారం సాయంత్రం 3.20కి చేరుకుంటారు. అక్కడనుంచి నేరుగా కారులో 4.20 గంటలకు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని 5.20 గంటలకు తిరుమలకు బయల్దేరి వెళతారు. 6 గంటలకు పద్మావతి అతిథిగృహం చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వరాహస్వామిని, 10 గంటలకు శ్రీవారిని దర్శించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో తిరుపతి, తిరుమల పోలీసు కనుసన్నల్లో గత పదిరోజులుగా ఉంది.

తిరుమలలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, టీటీడీ ఈవో

నష్టపరిహారం అందుతుంది

భూములు ఇవ్వడంలో ఉన్న సమస్యలు అన్నింటినీ పరిష్కరిస్తాం: కలెక్టర్

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని కోసలనగరంను పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేయడమే లక్ష్యమని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోలనగరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఏపీఐఐసీ అధికారులు, రైతులతో ముఖాముఖి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు త్వరితగతన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా రైతులు భూములు ఇచ్చిన రైతులందరికీ నష్టపరిహారం తప్పకుండా అందుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతులకు పట్టా లేకుండా భూమి ఎవరు స్వాధీనంలో ఉందో వారికి కూడా పరిహారం అందిస్తామన్నారు. రైతులతో చర్చల అనంతరం ఎకరా భూమి రూ.14లక్షలుగా ఒప్పందం కుదుర్చుకున్నామని, పండ్ల చెట్టు ఉంటే అదనంగా వస్తుందన్నారు. పరిశ్రమ స్థాపనకు విద్యుత్, తాగునీరు సరఫరా చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, పరిశ్రమ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించి ముందుకు రావాలన్నారు. పరిశ్రమల రాకతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతుందన్నారు. రైతులు మాట్లాడుతూ భూములు ఇచ్చిన ప్రతి రైతు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని, పొల్యూషన్ లేని కంపెనీని నిర్మించాలని కలెక్టర్‌ని కోరారు. ప్రతి రైతుకు రికార్డు లేకపోయినా కూడా అందరికీ సమానంగా చెల్లిస్తామని నేరుగా రైతు అకౌంట్‌లోనే నగదు జమవుతుందా అని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం రూ.67లక్షలు నిధులతో నిర్మాణం చేపట్టిన తొమ్మిది సిమెంటు రోడ్లను ప్రారంభించారు. అనంతరం పలువురు సమస్యలపై కలెక్టరు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల డైరెక్టరు చినబాబు, ఏఎంసీ చైర్మన్ రాజమ్మ, ఆర్డీవో అనుపమ, ఎంపీడీవో రాజేంద్ర, ఏఈలు, ఏపీఐఐసీ అధికారులు, మండలం ఎంపీపీ మంజు బాలాజీ, జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ సెక్రటరీ చుక్కాధనుంజయ యాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, సింగిల్విండో అధ్యక్షుడు బాబుయాదవ్, రైతులు పాల్గొన్నారు.

రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ పరిశీలన

మైసూరులో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి వీలుగా కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్ బుధవారం మైసూరు నగరపాలక సంస్థలో జరుగుతున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజింగ్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ సీనియర్ శాస్త్రవేత్త వినోద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్లాస్టిక్ రీసైకిల్ మేనేజ్మెంట్, ప్రొడక్ట్స్, బ్లాక్ తయారీ అంశాలను పరిశీలించారు. మైసూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెస్ తీరును పరిశీలించి అక్కడ అధికారులతో చర్చించారు. చిత్తూరు నగర పాలక సంస్థలోనూ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీనియర్ శాస్త్రవేత్త వినోద్, అధికారులతో చర్చించారు.

అన్ని విధాలా మార్కెట్ యార్డుల అభివృద్ధి

మార్కెట్ యార్డ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అన్ని విధాలా మార్కెట్ యార్డ్‌లను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే, ఎంపీలు తెలిపారు. బుధవారం జరిగిన చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావుతో కలిసి హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ చిత్తూరులోని కట్టమంచి, మంగసముద్రం మార్కెట్ యార్డుల అభివృద్ధి, కట్టమంచి మార్కెట్ యార్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని, మాంసం, కూరగాయలు, పూలు, పండ్లు అన్ని విక్రయాలు ఇక్కడ నుండే జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి రైతులకు, సంస్థకు లాభదాయకంగా మార్చాలన్నదే ముఖ్యఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్‌అనురాధ, డైరెక్టర్లు, మేయర్ ఎస్.అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎస్ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో సహకార సంఘం

జండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి సహకార సంఘంలో 72వ అఖిలభారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ సహకార జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘాన్ని అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు సమిష్టి కృషితో సంఘాన్ని అభివృద్ధి పరచాలని తెలిపారు. ఈసందర్భంగా చైర్ పర్సన్ వి.చిత్రనాయుడు ఎమ్మెల్యేను పూలమాలవేసి దుస్సాలవతో ఘనంగా సన్మానించారు. పాలకవర్గ సభ్యులు మహబూబ్ బాషా, ప్రభాకర్, బంగారుపాల్యం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సతీష్, టిడిపి ప్రధాన కార్యదర్శి రబ్బి, అధ్యక్షుడు మొరార్బి, విజయేంద్ర యాదవ్, కృష్ణమూర్తి, వల్లేరు అమర్నాథ్ నాయుడు పాల్గొన్నారు.

రోడ్డుపై భారీ కొండచిలువ

ప్రజాశక్తి- సోమల: సోమల - పుంగనూరు ప్రధాన రహదారిపై భారీ కొండచిలువ బుధవారం రోడ్డుపై కనిపించింది. సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో రోడ్డుపై వెళ్తూ ఉండడంతో గుర్తించిన వాహనదారులు తమ వాహనాలను నిలిపివేసి కొండచిలువ రోడ్డు దాటే వరకు వేచి ఉండి ఆ తరువాత వెళ్లారు. రోడ్డుపై కనిపించిన కొండచిలువ కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది.

రైతుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు విడుదల
- రైతుల ఖాతాల్లో నగదు జమ



జీడీనెల్లూరులో..

ప్రజాశక్తి- జీడీనెల్లూరు: జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలో 66218 మంది రైతులకు అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకంలో రెండో విడతగా భాగంగా 24.05 కోట్ల రూపాయలు రైతుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కూటమి పార్టీ నాయకులతో కలసి రైతులకు మెగా చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రభుత్వం అండగా ఉన్నదని, నియోజకవర్గంలో ఇటీవల భారీ వర్షాల వలన ఇల్లు కోల్పోయిన బాధితులకు జిల్లా కలెక్టర్ రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారని పేదల పక్షపాతగా కలెక్టర్ మంచి నిర్ణయాలు తీసుకునిచున్నారని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి పంట పండించిన రైతులకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో 4 రూపాయల చొప్పున 183 కోట్ల రూపాయలు రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగింది తెలిపారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా పాడి పరిశ్రమలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, విస్తృతంగా రైతులు ఎంపిక చేసి పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో మనోహర్ గౌడ్, వ్యవసాయ అధికారి కల్పన, జీడీ నెల్లూరు వ్యవసాయ అధికారి భవాని, టిడిపి నాయకులు శ్రీధర్ యాదవ్, హరీష్ యాదవ్ పాల్గొన్నారు.

చిత్తూరు (యాదమరి): స్థానిక జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అధ్యక్షతన అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం కింద విడుదల నిధులను చెక్కు రూపంలో రైతులకు అందజేశారు. చిత్తూరు నియోజకవర్గంలో మొత్తం 20,326 మంది రైతులకు రూ.7.46 కోట్ల నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టిడిపి స్టేట్ అఫిసియల్ సురేంద్ర కుమార్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్, మాజీ ఎంపిపి చంద్ర నాయుడు, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ రమేష్ నాయుడు పాల్గొన్నారు.



చిత్తూరులో..



పలమనేరులో..

యాదమరి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ కలిగిరి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ నిధులకు సంబంధించిన చెక్కును రైతులకు అందజేశారు. ఐరాల మండలం రూ.4.28 కోట్లు, యాదమరి రూ.3.95 కోట్లు, బంగారుపాలెం రూ.6.06 కోట్లు, పూతలపట్టు రూ.4.07 కోట్లు, తవణంపల్లి రూ.4.29 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. పిఎసిఎస్ చైర్‌పర్సన్ చిత్రనాయుడు, తహశీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వీరేంద్ర, వ్యవసాయ అధికారి దీప, ఏమో వేణు, ఆర్డబ్ల్యూ ఏఈ ఉషారాణి పాల్గొన్నారు.

పలమనేరు: రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, ఎటువంటి ఆదాయం లేకున్నా అన్నదాతలకు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతన్నలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటున్నదని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని పలమనేరు మండలానికి చెందిన 5478 మంది రైతులకు రూ.3.53 కోట్లు, బైరెడ్డిపల్లి మండలం 7983 మంది రైతులకు రూ.5.26 కోట్లు, పెద్దపంజాణి 7553 మంది రైతులకు రూ.5.06కోట్లు, వి.కోట 9903 మందికి రూ.6.59 కోట్లు, గంగవరం 7451 మంది రైతులకు గాను 5.37 కోట్లకు చెందిన మొత్తం రూ.25.83 కోట్ల చెక్కును ఆయన రైతులకు పంపిణి చేశారు. బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్‌వి.బాలాజీ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, సోమశేఖర్ గౌడ్, ఆనంద్ పాల్గొన్నారు.

తవణంపల్లి: రైతుల ఖాతాలో అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు జమ చేయడం జరిగింది. దీంతో బుధారం మండలం జొన్నగురకల గ్రామంలో రైతులు సచివాలయం వద్ద పెద్దఎత్తున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు.

రొంపిచర్ల: మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన రెండో విడత నిధులు విడుదల కార్యక్రమం నిర్వహించారు. పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో 4231 మంది రైతులకు రెండు కోట్ల 83 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ చెక్కును రైతులకు అందజేశారు. ఎంపీడీవో ఎస్ మధుసూదన్ రెడ్డి, ఏవో శ్రావణి, సింగిల్ విండో అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కృష్ణమ నాయుడు, డి.చంగల్ రెడ్డి పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్రంలో రైతన్నలు ఆర్థిక అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం 5 వేలు పరస్పర సహకారంతో రైతు ఖాతాల్లో 7000 నగదు జమ చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రతి ఒకటి అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.



యాదమరిలో..

అటవీ ప్రాంత ప్రజలు 'గజగజ'

- జంట ఏనుగుల వరుస దాడులు
- పంట నష్టపోతున్న రైతులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ప్రజాశక్తి- రామకుప్పం: కుప్పం నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం మండల అటవీ గ్రామాలపై ఏనుగుల గుంపు నుండి విడిపోయిన జంట ఏనుగులు మూడు రోజులుగా పంటపోలాలపై వరుస దాడులకు దిగాయి. మండలంలోని ననియాల, ననియాల తాండ అటవీ సమీప గ్రామాల్లో పంటలపై ఆదివారం, సోమవారం, మంగళవారం రాత్రివేళల్లో వరుస దాడులు చేస్తున్నాయి. మంగళవారం రాత్రి ననియాల గ్రామ సమీపంలోని బాబు, జయప్ప, మురుగమ్మలకు చెందిన వరి, బీన్స్ పంటలను తిని, తొక్కి నాశనం చేశాయి. అలాగే శ్రీరామప్పకు చెందిన మామిడి చెట్ల కొమ్మలు విరిచాయి. ఇప్పటికే కోదండ, కామరాజ్ నాయక్‌ల వరి పంటలను తిని, తొక్కి ధ్వంసం చేశాయి. అటవీ సమీప ప్రాంత ప్రజలు, పంట పొలాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు. జంట ఏనుగులు అడవిలోని కూటల్ల వంక ప్రదేశంలో ఉన్నాయని, బుధవారం రాత్రి ననియాల, ననియాల తాండ, జీడిమాకులపల్లి, రామాపురం తండా, నారాయణపురం తాండ పరిసర ప్రాంతాల్లో సంచరించే అవకాశం ఉందని రైతులకు ఫారెస్టు అధికారులు ముందస్తుగా తెలిపారు. రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లరాదనీ, విద్యుత్ తీగలు ఏనుగులకు తగిలేంత ఎత్తులో ఉంటే వాటిని తొలగించాలని తెలిపారు. ఏనుగులు సంచరిస్తే అటవీ అధికారుల మొబైల్ 89196 68651, 63016 67521 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కాగా ఏనుగులు ఎప్పుడు ఏ గ్రామం వైపు వచ్చి పడతాయోనని అటవీ ప్రాంత ప్రజలు భయాందోళనతో గజ గజా వణికిపోతున్నారు. కాగా 30 ఏళ్ల క్రితం తమిళనాడు అటవీ ప్రాంతం నుండి వచ్చిన ఏనుగులు కుప్పం నియోజకవర్గ అటవీప్రాంతం అనువుగా ఉండటంతో ఇక్కడే స్థిరపడి తమ సంతతిని పెంచుకుంటున్నాయి. అయితే అడవిని దాటి ఏనుగులు గ్రామాలవైపు వస్తుండటంతో పలు ప్రమాదాల్లో ఏనుగులు, వాటి దాడుల్లో పెద్దఎత్తున మనుషులు చనిపోతున్నారు. ముఖ్యంగా అడవుల్లో ఏనుగులకు అవసరమైన ఆహారం, నీటి వసతి కల్పించి, అటవీ సరిహద్దు ప్రాంతం చుట్టూ సోలార్ ఫెన్సింగ్, కందకాలు ఏర్పాటు చేయాలనీ ప్రజలు కోరుకుంటున్నారు.

ఏనుగులు తొక్కి నాశనమైన వరి పంట

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- గణేష్‌పురం అటవీ ప్రాంతంలో 20 అడుగులకు పైగా తవ్వకాలు

ప్రజాశక్తి- కుప్పం

కుప్పం మండలం గణేష్‌పురం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరపడం స్థానికంగా కలకలం రేపుతోంది. సుమారు 20 అడుగులకు పైగా గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. ఈవిషయాన్ని స్థానికులు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో రిజర్వ్ ఫారెస్ట్‌లో యంత్రాలను తీసుకెళ్లి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఆనవాళ్లు ఉండడంతో ఫారెస్ట్ అధికారులు విచారణ చేస్తున్నారు. కుప్పం ఎఫ్ఆర్ఓ జయశంకర్ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇదిలా ఉంటే ఇదే ప్రాంతంలో అనధికారికంగా చెట్లు నాటడాన్ని స్థానికులు ఎఫ్ఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో కొబ్బరి చెట్లు ఎలా నాటుతారంటూ స్థానికులు ఎఫ్ఆర్ఓను ప్రశ్నించగా.. నాటిన చెట్లను అప్పటికప్పుడే తొలగించారు. అయితే రిజర్వ్ ఫారెస్ట్‌ను ఆక్రమించుకునేందుకు కొంతమంది చదును చేసి చెట్లు నాటారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపైన విచారించే చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఓ తెలిపారు. కాగా గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని ఎఫ్ఆర్ఓ జయశంకర్, కుప్పం డిఎస్పి పార్థసారథి పరిశీలించారు. ఓవ్యక్తి తరచూ ఈప్రాంతంలో సంచరిస్తుండడాన్ని తాము చూసామంటూ స్థానిక సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు అధికారులకు తెలిపారు. గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ప్రాంతంలో సిమెంటుతో ప్లాస్టింగ్ చేసిన ఆనవాళు ఉండగా.. రేపు రెవెన్యూ అధికారుల సమక్షంలో ఈ ప్రాంతంలో అధికారులు తవ్వకాలు చేపట్టినట్లు తెలిసింది.

గుప్త నిధులు తవ్వకాలను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్ఓ జయశంకర్

సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు..

జీవితం అమూల్యం: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు పట్టణంలోని ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సైబర్ క్రైమ్, విద్యార్థుల్లో పెరుగుతున్న ఆత్మహత్యల ధోరణి, మాదక ద్రవ్యాల వ్యసనం, హనీ ట్రాప్స్, డిజిటల్ అరెస్టులు, ఉద్యోగ మోసాలు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లు, నకిలీ కాల్ సెంటర్లు తదితర అంశాలపై కీలక సూచనలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత అని, మీరు ఆరోగ్యంగా, నైతికంగా, బాధ్యతాయుతంగా ఎదగడం సమాజానికి ఎంతో అవసరమన్నారు. సైబర్ ప్రపంచం వేగంగా మారిపోతోందని టెక్నాలజీ ఎంత ప్రయోజనకరమో, దాన్ని తప్పుగా ఉపయోగించే వారు అంతే ప్రమాదకరాలని అన్నారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, చాట్ యాప్‌లు, డేటింగ్ యాప్‌లు, అక్రమ డౌన్‌లోడ్ లింక్‌లు వంటి వాటి ద్వారా విద్యార్థులు తెలియకుండా ప్రమాదాల్లో పడే అవకాశాలు ఎక్కువగా ఉదని, ఏ తెలియని లింక్‌పై క్లిక్ చేయకూడదని, అనుమానాస్పద సందేశాలు, ఫోటోలు, వీడియో కాల్స్ వస్తే వెంటనే బ్లాక్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇటీవలి కాలంలో చిత్తూరు పట్టణంలో చోటుచేసుకున్న విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలను ప్రస్తావిస్తూ మీకు ఎలాంటి సమస్య వచ్చినా ఆత్మహత్య ఎప్పటికీ పరిష్కారం కాదని, చదువు, ఆరోగ్యం, కుటుంబ సమస్యలు ఇవి తాత్కాలికమని ఆత్మహత్య ఒక శాశ్వత నష్టాన్ని మిగులుస్తుందని తెలిపారు. మీ ప్రాణం మీ కుటుంబం, మీ భవిష్యత్తు కోసం అమూల్యమని వివరించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఈగల్‌క్లబ్ గురించి వివరిచారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పోలీసు అధికారులు, 500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విద్యార్థుల రవాణా భత్యం మంజూరు

తల్లుల ఖాతాల్లోకి రూ.1,66,59,000లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో అర్హత గల విద్యార్థులకు రవాణా భత్యం సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ.6వేలు చొప్పున వాళ్ళ తల్లుల ఖాతాలో జమ చేయనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. మొదటి విడతగా 5,553 మందికి ఐదు నెలలకు రూ.3వేలు చొప్పున వారి తల్లి ఖాతాల్లో జిల్లా మొత్తంగా రూ.1,66,59,000లు ప్రభుత్వం ద్వారా జమ చేయబడినది. అర్హత పొందిన విద్యార్థుల జాబితాను మండల విద్యాశాఖ అధికారులకు పంపడం జరిగిందన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఖాజీ ఫకృద్దీన్

ప్రజాశక్తి- పలమనేరు: బైరెడ్డిపల్లి మండలానికి చెందిన ఫకృద్దీన్ ఖాజీ బుధవారం పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం గ్రామానికి చెందిన హిదయతుల్లా కుమారుడైన ఫకృద్దీన్‌ను ఖాజీగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. బైరెడ్డిపల్లి మండలంలోని 17 మసీదులకు తనను ఖాజీగా నియమించమని ప్రభుత్వానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి ధన్యవాదాలు తెలియజేశారు. బైరెడ్డిపల్లి మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజా పీర్, ఇమామ్ సాబ్, పాల్ రసూల్ బాషా, హఫీజ్ హుస్సేన్, ఇబ్రహీం, అసీఫ్ పాల్గొన్నారు.

షాదీ ఖానా అభివృద్ధికి సహకరిస్తాం..

ప్రజాశక్తి-కుప్పం: కుప్పంలో షాదీ ఖానా అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయడంతో పాటు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం పట్టణంలోని షాదీ ఖానా మరమ్మతు పనులను బుధవారం ప్రారంభించారు. ఇటీవల కుప్పం షాదీ ఖానా చైర్మన్ గా సర్దార్ భాష ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో షాదీఖానా మరమ్మతు పనులను ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, మాజీఎంసి చైర్మన్ సత్యేంద్ర శేఖర్, డాక్టర్ సుదీర్, కౌన్సిలర్ జాకీర్, మైనార్టీ నాయకులు అన్సర్ బాష, గని, అల్లా, డైరెక్టర్లు బాబు, షానాజ్, ఫరూక్, మహధర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

ప్రజాశక్తి-యాదమరి: అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా యాదమరి మండలం కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో బుధవారం ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ ఎపి.లలిత ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు 17 మంది పురుష ఉపాధ్యాయులను సత్కరించారు. ఇన్‌ఛార్జి భాస్కర్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు కనకాచారి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం నెలకొని చక్కని విద్యాభాసంకు అవకాశముంటుందని అన్నారు. ఉపాధ్యాయులు మధుసూధన్, మధన్ మోహన్ రెడ్డి, దామోదర రెడ్డి, సుధాకర్, మహేష్ షణ్మగం, చిన్నదొరై, రాకేష్ రంగనాధం, చిట్టిబాబు, నాగభూషణం, రాజా, శరత్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి- విజయపురం (నగరి): విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అలవడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామిని అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విద్యార్థులు క్రమశిక్షణగా విద్యను అభ్యసిస్తూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పెద్దలను గౌరవిస్తూ వారి మార్గదర్శకత్వంలో నడిచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శంకరమ్మ, ఇందిర, పాఠశాల ప్రధానోధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజయపురం మండలం ఆలపాకం పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. బాలల హక్కులను గురించి వివరించారు. బాల కార్మిక చట్టాలు, బాలల హక్కుల చట్టాల గురించి విశదీకరించారు. ప్రధానోపాధ్యాయిని గౌరి, ఉపాధ్యాయులు భాగ్యరాజ్, జీఎంఎస్‌కే సెల్వి, ఏఎన్ఎం సావిత్రి, ఆశా వర్కర్ విమల తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు చిత్తూరు నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కార్యదర్శి శర్మ అధ్యక్షతన మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, విజయం విద్యాసంస్థల కరస్పాండెంట్ శైలజా తేజోమూరి, అరుణకుమారి, విమల, లక్ష్మీ, పూర్వాణి, పిసిఆర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రిటైర్డ్ లైబ్రేరియన్ లలిత పాల్గొన్నారు. వారు మాట్లాడారు విద్యార్థినులు అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం అతిథులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది డిప్యూటీ లైబ్రేరియన్ ఎం.గజేంద్ర బాబు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసచారి, టైపిస్ట్ గుణ, లైబ్రేరియన్స్ బిలాల్, పూర్ణిమ, సుల్తానా బాను, తులసీ కుమార్, సరస్వతి, దేవీబాల, ఎల్లమ్మ, పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంఈఓకు ఘనవీడ్కోలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలో ఇన్‌ఛార్జి ఎంఈఓగా విధులు నిర్వహించిన వేణుగోపాల్‌రెడ్డికి బుధవారం ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఎంఈవో -1 జనార్ధన్ రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డికి శాలువ కప్పి, పూలమాల వేసి సన్మానించారు. అనంతరం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తాను పనిచేసిన సమయంలో ఉపాధ్యాయ బృందం అందించిన సహకారం అపూర్వమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇదేవిధంగా కృషి చేయాలని, విద్య ద్వారా వారిని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను మరింత చొరవతో కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ నాయకులు ఆయన సేవలను ప్రశంసించారు.

చెవిరెడ్డికి 'కూటమి' బిగ్‌షాక్

అక్రమాస్తుల జప్తుకు ఆదేశాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : చంద్రగిరి మాజీ ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. మద్యం కుంభకోణం కేసులో అక్రమాస్తుల జప్తుకు ఆదేశాలు జారీ చేసింది. అధికారిక రిజిస్ట్రేషన్ విలువను కేవలం రూ.8.85 కోట్లుగా చూపించినప్పటికీ, నిజానికి వాటి విలువ రూ.54.87 కోట్లుగా సిట్ గుర్తించింది. సిట్ దర్యాప్తు సూచనల మేరకు ప్రభుత్వం క్రింది పేర్లపై ఆస్తుల అటాచ్‌కు ఆదేశాలు జారీ చేసింది. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్‌రెడ్డి, చెవిరెడ్డి సతీమణి లక్ష్మి సిఎంఆర్ ఇన్‌ఫ్రా పేరుతో ఉన్న ఆస్తుల జప్తుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. చెవిరెడ్డి కుటుంబం మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన డబ్బుతో స్థిర, చర ఆస్తులు విపరీతంగా కొనుగోలు చేసినట్లు సిట్ పేర్కొంది. రిజిస్ట్రేషన్ విలువను తక్కువగా చూపించి, పెద్ద మొత్తాన్ని లెక్కల్లో చూపకుండా బ్లాక్ మనీగా మార్చినట్లు రికార్డులు వెల్లడించాయి.

తిరుపతి జిల్లా చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, తొట్టంబేడు, అలాగే నెల్లూరు జిల్లా గూడూరు, పొదలకూరు, చిత్తూరు జిల్లా పుత్తూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులు ఉన్నట్లు సిట్ పేర్కొంది. వెండోడులోని అరబిందో ఫార్మాకు కె.వి.ఎస్ ఇన్‌ఫ్రా ద్వారా జరిగిన 263.28 ఎకరాల భూమి కొనుగోలు-అమ్మకాల్లో భారీ మోసం జరిగిందని సిట్ తేల్చింది. ఆ సమయంలో భూమి విలువలు అప్రత్యక్షంగా పెంచి.. పెద్ద మొత్తంలో బ్లాక్ మనీని వైట్‌గా మార్చినట్లు నిర్ధారించింది. ఈ ఒక్క లావాదేవీ ద్వారానే కె.వి.ఎస్ ఇన్‌ఫ్రా రూ.13.3 కోట్లు బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చిందని సిట్ నివేదిక తెలిపింది. దర్యాప్తు నివేదిక ఆధారంగా అవినీతి నిరోధక చట్టం, క్రిమినల్ చట్టాల్లోని పలు సెక్షన్ల ప్రకారం ఆస్తుల అటాచ్‌కు అనుమతి ఇవ్వాలని సిట్ ప్రభుత్వంను కోరింది. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ, ఆస్తుల అటాచ్ కోసం విజయవాడ కోర్టులో దరఖాస్తు చేసేందుకు అనుమతి ఇచ్చింది. డీజీపీ తదుపరి చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులను హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ జారీ చేశారు.

డిజిటల్ నర్స్ విధులపై శిక్షణ

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎం అండ్‌హెచ్‌ఓ

ప్రజాశక్తి- పలనే రూరల్ (గంగవరం): చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరు జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న డిజిటల్ నర్స్ సెంటర్ విధులపై ఒక్కరోజు శిక్షణా కార్యాక్రమం నిర్వహించడం జరిగింది. పలమనేరు డివిజన్‌లోని ఎంఎల్‌హెచ్‌పిలకు మధర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సిస్టం మెయింటెనెన్స్‌పై, వారు చేయవలసిన విధులపై శిక్షణ అందించారు. ఈ డిజిటల్ నర్స్ సెంటర్ ప్రారంభంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు గుండె వ్యాధులు, కేన్సర్, థైరాయిడ్, బీపీ, షుగర్ వంటివాటికి చిక్సిత అందిస్తారని తెలిపారు. అలాగే గర్భిణులకు, చిన్న పిల్లలకు, బాలింతలు ఎదుర్కొనే అనారోగ్య సమస్యలు, వృద్ధుల దీర్ఘకాలిక వ్యాధులు, అంటువ్యాధులపై ఎప్పటికప్పుడు కాల్ సెంటర్ ద్వారా ప్రజలకు నాణ్యమైన ఉచిత ఆరోగ్య సేవలను అందించబడునని తెలిపారు. ఈ సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ప్రజలు అనారోగ్యం బారిన పడిన వారు ఈ సెంటర్‌లో చికిత్స తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ, కాలేజీ అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు పీఈఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు నూజివీడులో జరిగే ఎస్‌జిఎఫ్ బాస్కెట్బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. పలమనేరులో ఎస్‌జిఎఫ్ బాస్కెట్బాల్ టోర్నమెంట్ సెలక్షన్స్ జరిగాయి. ఇందులో 12 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా అందులో పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన చేతన్, లలిత్, కళ్యాణ్, కృతిన్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 21 నుండి 23 వరకు నూజివీడులో జరిగే ఎస్‌జిఎఫ్ బాస్కెట్బాల్ టోర్నమెంట్లో పోటీ పడనున్నారని పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణ బాబు తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- బంగారుపాల్యం: గ్రంథాలయంకు కరణం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పుస్తకాలను గౌరవ అధ్యక్షులు షణ్ముగం పిలై ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన అందిస్తాయని, ప్రతి విషయాన్ని నేర్చుకుంటూ, పుస్తకాలు చదవడం వలన విజ్ఞానవంతులుగా తయారవుతారన్నారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, కరణం సంక్షేమ సంఘ కార్యదర్శి రవీంద్ర ప్రసాద్, కోశాధికారి శంకరన్, ఉప కార్యదర్శి రవిచంద్ర, ఈసీ మెంబర్ లక్ష్మీనాథ్, విశ్రాంతి, ఉపాధ్యాయులు జోహార్ హుస్సేన్ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీలు

రికార్డులను తనిఖీ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం స్పెషల్ ఆఫీసర్ జి.లక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను, ఫైల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ప్రసన్న కుమార్‌ను ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా తమకు వచ్చిన ఫిర్యాదుల గురించి తహశీల్దార్‌తో చర్చించారు. వారి వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ దాము, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: స్థానిక ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న అంగన్ వాడీ పర్యవేక్షకురాలు రోజా రమణి మాట్లాడుతూ విద్యార్థులు తమకు కల్పించిన హక్కులపై అవగాహన ఎంతో అవసరమన్నారు. పిల్లలు చదువు కంటే సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని సూచించారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అలిమ్ కో ఆధ్వర్యంలో బుధవారం పీవీకేఎన్ కళాశాలలో నిర్వహించిన దివ్యాంగులు, వృద్ధ పౌరుల కోసం సహాయ పరికరాల గుర్తింపు శిబిరాన్ని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పరిశీలించారు. శిబిరంలోని ఏర్పాట్లను పరిశీలించి దివ్యాంగులకు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శిబిరంలోని వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సాయం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల

మహిళల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి- పలమనేరు: ప్రపంచ ఏఎంఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మహిళ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణా రెడ్డి మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం ప్రపంచ ఏఎంఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ముఖ్యంగా దేశంలోని మహిళలు, పిల్లల ఆరోగ్యం, పోషకాహారాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు, యుక్తవయస్సు బాలికలు, పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించటం, పోషకాహారం, పరిశుభ్రతపై ఆరోగ్య కౌన్సెలింగ్, అవగాహన సెషన్లను నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే దేశవ్యాప్తంగా సమగ్ర ఆరోగ్య సేవలను పొందేలా చూసుకోవడం, యాంటీబయాటిక్ మందులు, యాంటీ మైక్రోబయాలజీ వాడకం తగ్గించుటంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎంఎస్. ఖాదర్ మొహిద్దీన్, వైద్యులు డాక్టర్ యుంగంధర్, లత, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

వికలాంగులు శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- వీ కోట: వికలాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాల పంపిణీ నమోదు కార్యక్రమాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఆర్‌డిఓ భవాని తెలిపారు. సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వికలాంగులు, వృద్ధపౌరుల శారీరక అవసరాలను గుర్తించడం వారికి అవసరమైన సహాయక పరికరాలను గుర్తించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా ఈనెల 24వ తేదీ సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పలమనేరు మున్సిపాలిటీ, పలమనేరు అర్బన్, వీకోట, బైరెడ్డిపల్లి, గంగవరం, పెద్దపంజాణి మండలాలకు చెందిన వారు ఈ శిబిరంలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే వారి కోసం అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ శిబిరానికి విచ్చేసేవారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలను తహశీల్దార్ ఉదయ్ సంతోష్‌కు వివరించారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ మోహన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్‌డిఓ భవాని

జాబ్ మేళాలో 86 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ(జేకేసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగమేళాలో 86 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అన్నారు. విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి కళాశాల ఎల్లప్పుడు కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.గుణశేఖర్రెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాకు 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనడం జరిగిందన్నారు. అందులో సుమారు 172 మంది నిరుద్యోగులు పాల్గొనడంతో 86మంది ఉద్యోగ అవకాశాలను దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నిరుద్యోగులు మెగా జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలను దక్కించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్డీసీ జిల్లా ప్లేస్మెంట్ అధికారి లోకేష్, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు. నిరుద్యోగులు పలువురు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ విజయులురెడ్డి

పేదలను నట్టేట ముంచిన బాబు

మాజీ ఎమ్మెల్యే సునీల్

ప్రజాశక్తి- యాదమరి: వైద్య విద్యను అభ్యసించి పేదలకు నిస్వార్థంగా సేవ చేయాలనుకుంటున్న పేద విద్యార్థుల చిరకాల వాంఛను చిదిమేస్తూ వారిని నట్టేట ముంచేసావు కదా బాబూ..అని పూతలపట్టు వైఎస్సార్సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు మనోహర్ అధ్యక్షతన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఏ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణపై తీసుకున్న ప్రజాఆమోదయోగ్యం కానీ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమించి గద్దె దింపుతామని హెచ్చరించారు. జడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, మాజీ ఎంఎల్ఏ లలితా, రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శుల అమర్నాథ్ రెడ్డి, నాగశంకర్ రెడ్డి, రమేష్, ఓబుల్ రెడ్డి, గోవర్ధన్ నాయుడు పాల్గొన్నారు.

విజయపురం: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లుతుందని ఎంపీపీ మంజు బాలాజీ, మండల పార్టీ అధ్యక్షులు శివరాజు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం కలియంబాకం గ్రామంలో సర్పంచ్ విద్య భాస్కర్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గుణశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-కుప్పం

భారతదేశ అభివృద్ధిలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కృషి ఎన్నటికీ దేశ ప్రజలు మర్చిపోరని కాంగ్రెస్ పార్టీ కుప్పం ఇంచార్జ్ ఆవుల గోపి, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు నిజాముద్దీన్ పేర్కొన్నారు. కుప్పం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశ అభివృద్ధికి ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ అధ్యక్షుడు మునుస్వామి, నియోజకవర్గ సిరిసిల్ల అధ్యక్షుడు నాగరాజు, మైనార్టీ అధ్యక్షులు ఇర్ఫాన్ బాష, నాయకులు సుందర మూర్తి, వేలు, మునిరామయ్య పాల్గొన్నారు.



రైతులకు విరివిగా పంట రుణాలు

ఖాతాదారుల సమావేశంలో బ్యాంకు మేనేజర్

ప్రజాశక్తి- యాదమరి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఖాతాదారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. యాదమరి సహకార సంఘంలోని డిసిసి బ్యాంకు గ్రీన్‌పేట శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులు, రైతులతో నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ ఆర్.రఘు బాబు మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతిరైతు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని, ఏటీఎం కార్డు ఇస్తున్నామని, ఫోన్ పే గూగుల్ పే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. పంట రుణాలు మూడు లక్షల నుండి ఐదు లక్షల వరకు ఇస్తామని, హౌసింగ్ రూరల్ లోన్ ఐదు లక్షల వరకు సహకార సంఘాల ద్వారా ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సూపర్వైజర్ టీ.ధనంజయ రెడ్డి, సహకార సంఘ సీఈవో ఆర్.గుణశేఖర్, సిరాజ్ బాష, ఖాతాదారులు రైతులు పాల్గొన్నారు.

మా తండ్రి ఆస్తిని మాకు అప్పగించండి..

న్యాయం చేయకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్యే శరణ్యం..

ప్రజాశక్తి- కార్వేటినగరం: తమ తండ్రి ఆస్తిని మరో వ్యక్తి అక్రమంగా వారి పేరుపై మార్చుకుని అనుభవిస్తున్నాడని.. తమకు న్యాయం చేయాలని కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని, న్యాయం చేయకుంటే తమ కుటుంబానికి ఆత్మహత్య శరణ్యమని, పురుగుల మందుతో బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండల పరిధిలోని అల్లాగుంట గ్రామానికి చెందిన అశోక్, కరుణాకర్లు తమ ఆవేదనను మీడియా ఎదుట వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రికి అన్నూరులో సర్వే నెంబర్ 216/15.294/6, 294/5.294/265 4.72 సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారులకు ముడుపులు చెల్లించి తమ రికార్డులను తారుమారు చేసి తమ పేర్లను రికార్డుల నుంచి తొలగించి ఆన్లైన్లో లేకుండా చేశారని ఆరోపించారు. రెవెన్యూ శాఖ అధికారులు తప్పదాల వల్ల నేడు తమకు అన్యాయం జరిగిందని తెలిపారు. 2022 నుంచి పోరాటం చేస్తున్నప్పటికీ తమకు న్యాయం జరగలేదని కన్నీరుమున్నీరయ్యారు. గతంలో రెవెన్యూ అధికారులకు ముడుపులు ముట్టడంతో చేసిన తప్పిదాలతో తమ కుటుంబానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని లేనికుంటే కుటుంబ సభ్యులతో సహా తహశీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని వాపోయారు.

డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంకు గాను స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అన్నపూర్ణ శారద బుధవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని, కళాశాలలోని ఇంటర్మీడియట్ తత్సమానమైన అర్హత కలిగిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు విద్యా శాఖాధికారులకు విన్నవించామని తెలిపారు. కోర్సులలో చేరాలనుకొనే వారు ఈనెల 21లోపు సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 - 2026 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సులు, బీఏ హానర్స్ ఎకనామిక్స్, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులన్నీ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో చేరదలిచిన వారు సంబంధించిన సర్టిఫికెట్లన్నీ (టీసీ, స్టడీ, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్,) ఒరిజినల్‌తో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో కళాశాలలో ఈనెల 21వ తేదీ లోపు సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు భరణి నాథ్‌రెడ్డి 98851 25771, నరేంద్ర బాబు 7702917803, భీమ మోహనరావు 970442 5888లను సంప్రదించాలని కోరారు.

టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుమల: తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన డార్లింగ్ క్లాసిక్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ శ్రీ మురళి వెంకటసుబ్బు భక్తుడు బుధవారం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం అందించారు.ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు డీడీని అందజేశారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION), CHITTOOR.
O.S. No.1083 of 2023
Between:
R. Lakshmi .. Plaintiff
And:
1. P.R Subrmanayam
2. Nalandana
.. Defendants
NOTICE TO THE DEFENDANTS
1. Sri. P.R. Subramanayam, Business,
2. Smt. Nalandana
W/o P.R. Subramanayam,
Both are Residing D.No2-597,
Sathram Street, Kongareddy Palli,
Chittoor Town, Chittoor Mandal,
Chittoor District,
Sir/Madam
Please take notice that the above case stands posted to **12.12.2025 at 10.30** a.m. for your appearance before the Hon'ble Court. If you fail to appear on that date either in person or to your counsel, the matter will be decided on merits in your absence.
Sd/- **L.MOHAN BABU**
Advocate,Chittoor,

గౌరవ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వినియోగ దారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ,ఎ.పి
F.A.NO. 97 OF 2025
Between
ఆర్.కౌషిక్ రెడ్డి లోచర్ల, S/o ఎల్.ఆర్.జయప్రకాష్
డి.నెం.30-731,పాంచాలపురం దగ్గర
సుఖీభవ పంక్షన్ హాల్ దగ్గ,మంగసముద్రం,
సంతపేట,చిత్తూరు,చిత్తూరు జిల్లా, ఎ.పి.
....అప్పెలెంట్/ కంప్లైనెంట్
And
ది మేనేజర్,రినాల్ట్ చిత్తూరు(Renault Chittoor)
224,లాయర్స్‌కాలనీ ఏరియా,కట్టమంచి,
బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా, స్ట్రీట్ నెం.400,
చిత్తూరు,చిత్తూరు జిల్లా, ఎ.పి-517001
.... రెస్పాండెంట్/ ఆపోసిట్ పార్టీ
రెస్పాండెంట్/ఆపోసిట్ పార్టీకి నోటీసు
పై తెలిపిన దావా **F.A.NO. 97 OF 2025**ను అపెలెంట్ గౌరవ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార్ కమీషన్, విజయవాడ నందు దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా 19.12.2025 వ తేదీన వాయిదా ఉన్నది. కావున ఆ దినము మీరు పై తెలిపిన కమీషన్ ముందు ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. ఆ రోజు మీరు హాజరు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎల్.ఆర్.జయప్రకాష్,
అప్పెలెంట్/ కంప్లైనెంట్ తరపు న్యాయవాది